మత్తుకు బానిస కావద్దు

- ఏలూరు జీజీహెచ్‌లో డీ అడిక్షన్ సెంటర్
- రెండేళ్లలో 370 మందికి చికిత్స

ఏలూరు టౌన్: 'ఏలూరుకు చెందిన ఒక యువకుడు స్నేహితులు సరదాగా కాల్చుతుంటే గంజాయిని అలవాటు చేసుకున్నాడు. మెల్లగా మత్తుకు అలవాటు పడ్డాడు. ఈ అలవాటు కాస్తా వ్యసనంగా మారిపోయింది. చక్కగా కాలేజీకి వెళ్లి చదువుకోవాల్సిన ఆ యువకుడు గంజాయికి బానిసగా మారాడు. తల్లిదండ్రులు తమ కుమారుడి ఉజ్వల భవిష్యత్తుపై కోటి ఆశలు పెట్టుకుంటే, గంజాయి వ్యసనం అతడి జీవితాన్ని నిర్వీర్యం చేసేస్తోంది. వైద్యుల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే అతను తనకు మెంటల్ ఏమీ లేదని నిరాకరిస్తున్నాడు.' ఇలాంటివి నేడు సమాజంలో కోకొల్లలుగా తారసపడుతున్నాయి. మద్యం, సిగరెట్, గంజాయి వంటివి తొలుత అలవాటుగా సరదాగా ప్రారంభిస్తోన్న యువత, చివరికి వ్యసనంగా మారిపోతూ జీవితాలను కభళిస్తున్న దైన్యస్థితి కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యసనాన్ని ఎవరూ సొంతంగా వదులుకోలేరని, ఖచ్చితంగా వైద్య నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక చికిత్స అందించాల్సి ఉంటుందని అంటున్నారు. ముందుగా వైద్య చికిత్స పట్ల ప్రజల్లో అవగాహన కావాలని, సైక్రియాటిస్ట్ వద్దకు వెళ్లేందుకు ఎవరూ ఇష్టపడరని, కానీ ప్రతి వ్యాధికీ ఒక నిర్దేశిత చికిత్స అందిస్తేనే ఉపశమనం, నివారణ వస్తుందని వైద్యులు వివరిస్తున్నారు.

బానిసల్లో 40 శాతం యువతే

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో గత ఐదేళ్లుగా డీ–అడిక్షన్ సెంటర్‌ను ప్రత్యేక వైద్య నిపుణుల సారధ్యంలో నిర్వహిస్తున్నారు. మానసిక విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో డీ – అడిక్షన్ సెంటర్‌లో మత్తుకు బానిసలైన బాధితులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. గత ఐదేళ్ళ కాలంలో డీ–అడిక్షన్ సెంటర్‌లో సుమారుగా 4690 మంది బాధితులకు చికిత్స అందించారు. ఇక గత రెండేళ్లలో అడిక్షన్ సెంటర్‌లో 370 మంది వ్యాధి బాధితులకు చికిత్స అందించి, ఆరోగ్యాన్ని మెరుగుపరిచారు. ఇటీవల మత్తు పదార్థాలకు బానిసలుగా మారేవారిలో 40 శాతం మంది యువతే ఉండటం ఆందోళన కలిగిస్తోంది.


డీ-అడిక్షన్ సెంటర్‌లో బాధితులతో మాట్లాడుతున్న వైద్యులు

మానసిక వైద్యనిపుణులతో చికిత్స



టీ, కాఫీ వంటివి సైతం తొలుత అలవాటుగా ఉంటాయి. ఇదే తరహాలో సిగరెట్, మద్యం, గంజాయి అలవాటు చేసుకుంటారు. కొంతకాలానికి వ్యసనంగా మారిపోతుంది. ఒక వ్యక్తి అలవాటును మానుకోగలడు. వ్యసనానికి బానిసగా మారిపోయే ప్రమాదం ఉంది. వ్యసనం అనేది వ్యాధి అనే విషయాన్ని గుర్తించాలి. మద్యం సేవించటం వ్యసనంగా మారిన అనంతరం మద్యాన్ని మానివేస్తే వంట్లో వణుకు, దడగా ఉండటం, ఫిట్స్, వాంతులు, గ్యాస్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఉంటే మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి. సాదారణంగా తమకు ఏమీ మెంటల్ లేదని, మానసిక వైద్యుల వద్దకు వెళ్లేందుకు బాధితులు నిరాకరిస్తారు. ఈ వ్యాధికి సరైన చికిత్స మానసిక వైద్యనిపుణులు మాత్రమే ఇవ్వగలరనే విషయాన్ని ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ వ్యాధికి ఎవరు చికిత్స అందించాలనే అంశాలపై స్పష్టమైన నిబంధనలు ఇచ్చారు. ఏలూరు జీజీహెచ్‌లో డీఅడిక్షన్ సెంటర్‌లో మెరుగైన వైద్య చికిత్స అందుబాటులో ఉంది.

– డాక్టర్ సీహెచ్ వంశీకృష్ణ, మానసిక వైద్య విభాగం హెచ్‌వోడీ, ఏలూరు జీజీహెచ్

క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, బాలింతలు

ఏలూరు (టూటౌన్): పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఏలూరు అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న ఫస్ట్ సెక్టార్ పుష్పలీల నగర్, ఇజ్రాయిల్ పేట, రాణి నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ మంగ ఆధ్వర్యంలో పిల్లలకు అధిక శక్తినిచ్చే ఆహార పదార్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు తూర్పువీధికి చెందిన ఒక యువకుడు కుటుంబ గొడవలతో ఉరివేసుకున్నాడు. దుర్గాసి దుర్గారావు (34)కు మాధవితో రెండేళ్ల క్రితం వివాహమైంది. సంతానం లేకపోవటంతో వారి మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 18న రాత్రివేళ మద్యం తాగొచ్చిన దుర్గారావు భార్యతో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లోని గదిలోకెళ్లి తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై మదీనా బాషా ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శనివారం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై ప్రత్యేక కార్యక్రమం

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన జీవిత చరిత్రపై ప్రత్యేక కార్యక్రమం ఏలూరులో శనివారం నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గల అంబికా ప్లేవర్స్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ క్రమ శిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ పాకా సత్యనారాయణ మాట్లాడుతూ అంబేడ్కర్ జీవిత విశేషాలు, ఆయన దేశానికి చేసిన సేవలను వివరించారు. పార్టీ జిల్లా నేతలు సీహెచ్‌వీ కిషోర్, అయ్యాజీ వేమా, అంబికా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోమటిలంకలో ర్యాలీ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగమణి ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ఫ్లెక్సీలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. సర్వేయర్, ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి


పోస్టర్ విడుదల చేసిన నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గ్రంథాలయ పునరుజ్జీవన వేదిక ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బీఎన్ సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రంథాలయాలకు ప్రజల నుంచి వసూలు చేసిన సెస్సును జమ చేయడం లేదని, వెంటనే ప్రజల వద్ద వసూలు చేసిన ఆస్తి పన్ను నుంచి 8 శాతం గ్రంథాలయ సెస్సును వెంటనే గ్రంథాలయాలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయాల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఔత్సాహిక రచయితలు తీసుకొచ్చిన సాహిత్య సంపుటాలను, సంకలనాలను కచ్చితంగా 30 శాతం జిల్లా గ్రంథాలయాలు కొనుగోలు చేయాలని కోరారు. ఏలూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారులు మోచర్ల రామచంద్ర రావు, నిడమర్తి లక్ష్మీనారాయణ పంతులు స్ఫూర్తితో ఈ జిల్లాలో గ్రంథాలయ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈనెల 27న విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి గ్రంథాలయ పునరుజ్జీవన ఉద్యమ వేదిక సదస్సును విజయవంతం చేయాలని ఏలూరు నగర ప్రజలను కోరారు. అనంతరం ఎనిమిది డిమాండ్లతో కూడిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఉద్యమ వేదిక కన్వీనర్ నాగాస్త్ర, కో కన్వీనర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త రెడ్డి శ్రీనివాస డాంగే, విశ్రాంత స్టేట్ బ్యాంక్ మేనేజరు వై.ఆనంద నాయుడు, విశ్రాంత హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కస్తూరిరావు, డి.శ్రీనివాస్, విశ్రాంత కళాశాల ఉపన్యాసకులు పీవీ సుబ్బారావు, మానవత సంస్థ నాయకుడు మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


అంజుమన్ హాల్లో ప్రమాణ స్వీకారం చేసిన ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని ముస్లింలకు సంబంధించిన ప్రతిష్టాత్మకమైన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. గత పాలక మండలి అధ్యక్షుడు సులేమాన్ అనేక అవినీతి కార్యకలాపాలకు పాల్పడడంతో ఆయనను తొలగించి అంజుమన్ సంస్థకు మెజారిటీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. కాగా పాత అధ్యక్షుడి తొలగింపులో న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు శనివారం నగరానికి చెందిన చదలవాడ వెంకట రమణారావు అనే న్యాయవాది ఎన్నికల అధికారిగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను అధికారికంగా ప్రకటించడంతో పాటు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంజుమన్ హాల్లో నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ నగరంలోని పేద ముస్లింల సంక్షేమానికి పని చేస్తున్న అంజుమన్ సంస్థ నిధులను గత అధ్యక్షుడు పక్కదారి పట్టాంచారని విమర్శించారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. నూతన అధ్యక్షుడు ఎండీ జబివుల్లా, సెక్రటరీ అహమదుల్లా షరీఫ్, కోశాధికారి ఎస్కే సిరాజ్ బాష, కమిటీ ముఖ్య సలహాదారుడు, 47 డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా, అంజుమన్ వ్యవహారాల అధ్యక్షులు రాజా అహ్మద్, గౌరవ అధ్యక్షులు ముజుబూర్ రెహమాన్, ఎస్కే మస్తాన్ భాష, ప్రచార కార్యదర్శి ఎండీ ఎక్బాల్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే బడేటి చంటిని మర్యాదపూర్వకంగా కలవడంతో వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	24	బీక్షచిక్కుడు	76
వంకాయలు (తెలుపు)	26	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	38	కంద	80
కాకర కాయలు	30	బీట్‌రూట్	30
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	38	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	18	అల్లం	60
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07–10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	01
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	04
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	02
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు – జీడీమెట్ల (ఖమ్మం)	20.15	01

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	02
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	02
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	01
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు – తిరుపతి	16.00	4830	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఖమ్మం)	20.00	98516	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (విజయవాడ)	22.10	98503	34

కలెక్టరేట్‌లో రెండు మొక్కలు చాలు !



ఏలూరు కలెక్టరేట్‌లో మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి


కలెక్టర్ ప్రాంగణంలో ఎండిపోయిన మొక్కలు, చెత్త

ఏలూరు కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఎక్కువగా ఉన్న చెత్తాచెదారం మధ్యలోనే ఇద్దరు ఉద్యోగులు బ్యాక్ గ్రౌండ్‌లో ఒక ఫ్లెక్సీ పట్టుకుని నిలబడ్డారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిలు చెరో మొక్క నాటి వెళ్లిపోయారు. కార్యక్రమం 5 నిమిషాల్లోనే ముగిసింది. అదే కలెక్టరేట్‌లో ఉన్న చెత్తను తొలగించే ప్రయత్నం ఎవరూ చేయకపోవడంపై పలువురు 'ఇదేం స్వచ్ఛ కార్యక్రమం' అంటూ విమర్శించడం కనిపించింది.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

చలివేంద్రం ప్రారంభం

ఏలూరు(మెట్రో) : గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో గృహనిర్మాణ శాఖ జిల్లా కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి జి.సత్యనారాయణ ప్రారంభించారు. వేసవిలో ప్రజలకు చల్లని తాగునీరు అందిస్తామన్నారు. పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగానమ్మ జాతర

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలిపూడి శ్రీ గంగానమ్మవార్ల జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం గ్రామ దాత దీపక్ నెక్స్‌జెన్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, అడుసుమిల్లి మున్నా, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, గ్రామ మాజీ సర్పంచ్ దాసరి నాగమల్లేశ్వరి, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు చేశారు. అమ్మవార్లకు విశిష్ట అలంకరణ చేశారు.

వయో పరిమితి కుదింపుతో అన్యాయం

బుట్టాయగూడెం: ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పొందేందుకు వయో పరిమితి 50 నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 2019లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరయ్యాయన్నారు. వాటిని తీసుకునే సమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నిలిచిపోయాయని చెప్పారు. అయితే అప్పటికే వయస్సు 45 సంవత్సరాలు ఉన్నాయని ఇప్పుడు 51కి పెరిగాయని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వయో పరిమితి తగ్గించడం వల్ల అనేక మందికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. వయో పరిమితి 50 నుంచి 60 సంవత్సరాలకు పెంచి రుణాలు మంజూరు చేయాలని కోరారు. పలువురు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో ధర్నా

దెందులూరు: ఉపాధి హామీ కూలీల వేతన బకాయిల విడుదల కోరుతూ ఈ నెల 21, 22 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం జీవరత్నం, పి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉపాధి కూలీలకు 2025 ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ రెండు నెలల వేతన బకాయిలు సుమారు రూ.61.39 కోట్లు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల వేతనాలను రూ.300 నుంచి రూ.307కు పెంచిందన్నారు.